# కేసీఆర్ పాలన గిరిజనులకు స్వర్ణయుగం

- గత పాలకులు వారిని ఓటుబ్యాంకుగా వాడుకొని వదిలేశారు..
- స్వరాష్ట్రంలో వారి సంక్షేమానికి పెద్దపీట
- 10 శాతం రిజర్వేషన్‌తో పెరిగిన ఉపాధి అవకాశాలు
- 11న రాష్ట్రస్థాయి గిరిజన ఆత్మగౌరవ సభ
- వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలి
- మంత్రి సత్యవతిరాథోడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత, చిత్రంలో మంత్రి సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గిరిజనులను అన్ని రకాలుగా అభివృద్ధి చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, ఇలాంటి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆమె ఎంపీ కవితతో కలిసి మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్, బీజేపీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11న రాష్ట్రస్థాయి గిరిజన ఆత్మగౌరవ సభను శామీర్‌పేట్‌లోని ఎస్‌ఎన్‌ఆర్ పుష్ప కన్వెన్షన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నామని, ముఖ్య అతిథులుగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు హాజరవుతున్నారని తెలిపారు. గిరిజనులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ పాలన గిరిజనులకు స్వర్ణ యుగమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు అవుతున్నా గిరిజనులు ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. గత పాలకులు వీరిని కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని గాలికొదిలేశాయని అన్నారు. స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనులకు అండగా నిలిచారని, 3,146 తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి వారి కలను సాకారం చేశారని అన్నారు. వేలాది మంది గిరిజనులు పాలకులుగా మారి తమ గ్రామాలను సమర్థవంతంగా పాలించుకుంటున్నారు. 6 శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచడంతోపాటు పోడు భూములకు పట్టాలు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. 10 శాతం రిజర్వేషన్‌తో గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగాయన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ పేరిట విదేశీ విద్య కోసం ఒక్కో విద్యార్థికి రూ.20లక్షల ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ గిరిజనులకు ద్రోహం చేశాయని, రిజర్వేషన్ అమలు చేయకుండా అడ్డుపడుతున్నాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజల ముందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ట్రైబల్ యూనివర్సిటీ ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ కాలయాపన చేసి గిరిజనులకు నష్టం చేసిందన్నారు. అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్ వెంటే గిరిజన బిడ్డలు ఉన్నారని అన్నారు.11న నిర్వహించే ఆత్మగౌరవ సభకు గిరిజన ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కురవి ఎంపీపీ పద్మావతీరవి, కురవి మండల అధ్యక్షుడు తోట లాలయ్య, నాయకులు పిచ్చిరెడ్డి, ముండ్ల రమేశ్, వేణుగోపాల్‌రెడ్డి, రామూనాయక్, రామచంద్రయ్య, యతిరాజు, బోడ శ్రీను పాల్గొన్నారు.



ఇల్లెందులో నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే హరిప్రియనాయక్

# మరోసారి సేవ చేసే అవకాశం ఇవ్వండి

- మీ అభిమానాన్ని మరువలేను..
- ఎమ్మెల్యే హరిప్రియానాయక్
- నామినేషన్‌కు చీమల దండులా కదిలొచ్చిన జనం
- ఇల్లెందు పట్టణంలో బీఆర్‌ఎస్ భారీ ర్యాలీ

ఇల్లెందు, నవంబర్ 9 : కొంతమంది స్వార్థపరులు పార్టీని వీడుతున్నా ప్రజలు తనకు మద్దతుగా ఇంత పెద్దఎత్తున కదలిరావడం తన అదృష్టమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ అన్నారు. బీఆర్‌ఎస్ ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బానోత్ హరిప్రియ నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా గురువారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మీ అభిమానాన్ని ఎన్నడూ మరువలేనని, సేవ చేసే మరోమారు అవకాశం ఇవ్వాలని కోరారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయం నుంచి బయలు దేరి ర్యాలీ జే కాలనీ, జగదాంబసెంటర్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, గోవింద్‌సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా తరలి వచ్చిన ప్రజలు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూల జల్లు కురిపిస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. చీమల దండులా కదిలొచ్చిన జనంతో పట్టణం కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మహబుబాబాద్ జడ్పీ చైర్మన్ ఆంగోత్ బిందు, ఏఎంసీ చైర్మన్ బానోత్ హరిసింగ్‌నాయక్, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్ రంగనాథ్, పట్టణ అధ్యక్షుడు నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు వరప్రసాద్, హన్మంతరావు, తతా గణేశ్, లక్ష్మణ్‌నాయక్, శీలం రమేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాషా, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 500 మంది వైఎస్‌ఆర్‌టీపీ నాయకుల చేరిక

నియోజకవర్గంలోని సుమారు 500మంది వైఎస్‌ఆర్‌టీపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వైఎస్‌ఆర్‌టీపీ ముఖ్య నాయకులు నాగారపు రాములు, ఊకే దశరథ్, బాలాజీనాయక్, కుమార్, బాబురావు, బండి కిరణ్, నర్సింహాచారి, నజీర్, ఎండీ షమీర్, అశోక్, మోహన్‌రావు పాల్గొన్నారు.

## నామినేషన్ వేసిన హరిప్రియానాయక్

ఇల్లెందు రూరల్, నవంబర్ 9: బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఇల్లెందు, కొత్తగూడెం ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కలిసి నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి కాశయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధనబలం కంటే ప్రజాబలం గొప్పదని, బీఆర్‌ఎస్ పార్టీకి అది పుష్కలంగా ఉందన్నారు. నవంబర్ 30వ తేదీన ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు ఎస్ రంగనాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జానీపాష పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాయమాటలకు మోసపోవద్దు

- ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి
- బీఆర్‌ఎస్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు
- సీఎం కేసీఆర్‌తోనే రైతుల అభివృద్ధి
- మళ్లీ అధికారంలోకి రాగానే రూ.400కే గ్యాస్, పింఛన్లు పెంపు
- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



ఆటోలో ప్రయాణిస్తున్న వారిని ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం, నవంబర్ 9 : బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. కేసముద్రం మండలంలోని పెనుగొండ, బేరువాడ, నర్సింహులగూడెం, రంగాపురం, బోడమంచతం, బిచ్చానాయక్‌తండా, మరితండాల్లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ఓటు అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే చెరువులను బలోపేతం చేసి, కాల్వల ద్వారా వ్యవసాయానికి పుష్కలంగా సాగు నీరు, ఏటా ఎకరానికి రూ.10వేలు పంట పెట్టుబడి ఇచ్చి రైతులను ఆదుకున్నట్లు తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన రైతు కుటుంబాలకు రూ.5లక్షల సాయం అందజేసి కొండంత అండగా నిలిచారని అన్నారు. కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్ వంటి పథకాలు పేద ప్రజల ఆర్థిక ఇబ్బందులను తొలగించాయన్నారు. సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమలకు అనుమతి ఇవ్వడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి కలెక్టర్లును అందుబాటులో ఉంచడంతో పరిపాలన వేగవంతమైందని చెప్పారు. పోడు రైతులకు పట్టాలు ఇచ్చి ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి అభివృద్ధి చేశారని తెలిపారు. సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి రాగానే రూ.400 గ్యాస్ సిలిండర్, ఎకరానికి రూ.16వేలు అందిస్తాడని తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా, రూ.15 లక్షల పరిమితితో ఆరోగ్యబీమా ఇవ్వనున్నట్లు తెలిపారు. పేద మహిళలకు నెలకు రూ.3 వేల ఆర్థిక సాయం, వృద్ధులకు రూ.5 వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకుంటూ ప్రజాధనాన్ని కొల్లగొడుతుందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి వంటి పథకాలను ఎం దుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పా ర్టీ అంటేనే స్కాములకు నిలయమన్నారు. 3గంటల కరెం ట్ చాలన్న కాంగ్రెస్‌కు ఓటేస్తారా.. 24 గంటలు కరెంట్ ఇచ్చే బీఆర్‌ఎస్‌కు ఓటేస్తారా..ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోతే భవిష్యత్ అంధకారం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ మర్రి రంగారావు, ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నీలం దుర్గేశ్, మండల అధ్యక్ష కార్యదర్శులు నజీర్ అహ్మద్, కముటం శ్రీనివాస్, ఎంపీటీసీలు దుబ్బాకుల వెంకన్న, సట్ల వెంక న్న, బోడ కవిత, నాయకులు రమేశ్, జాటోత్ హరీశ్‌నాయక్, రాజేందర్, లక్ష్మీనారాయణ, షేక్‌బాలు, దేవారపు రమేశ్, నలమాస జగన్, భీమానాయక్ పాల్గొన్నారు.

# గ్యారెంటీలకు వారెంటీ లేదు

- కాంగ్రెస్‌ను నమ్మితే అంధకారమే..
- అభివృద్ధిని చూసి ఓటెయ్యండి
- డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్

దంతాలపల్లి, నవంబర్ 9 : కాంగ్రెస్ గ్యారెంటీలకు వారెంటీ లేదని బీఆర్‌ఎస్ డోర్నకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. గుడ్డిగా వారిని నమ్మితే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. గురువారం ఆయన మండలంలోని పెద్దముప్పారం, రామానుజపురం, వేములపల్లి, దొనకొండ, గున్నెపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. అభివృద్ధి, అందుతున్న సంక్షేమాన్ని చూసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవ చేయడమే తన జీవితాశయమన్నారు. పక్క జిల్లా నుంచి ఇక్కడి వలస వచ్చిన నాయకులకు మన సమస్యలు ఎలా తెలుస్తాయన్నారు. ఎన్నికల సమయంలో గంగిరెద్దుల్లా వచ్చి వెళ్లే నాయకుల మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంటు, దళిత బంధు, గృహలక్ష్మి వంటి బృహత్తర పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో లేవన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకే ఓటడిగే నైతిక హక్కు ఉందన్నారు. ప్రజలు ఆలోచించి పనిచేసే వారికే ఓటేయాలని కోరారు. అనంతరం పలు గ్రామాల నుంచి పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ వొలాద్రి ఉమ, పీఏసీఎస్ చైర్మన్ సంపెట రాము, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు ధర్మరాపు వేణు, సర్పంచ్‌లు హిమబిందు, నాగయ్య, ఉప్పలయ్య, వసంత, వెంకటనారాయణ, ఎంపీటీసీలు పద్మ, రాధిక, నాయకులు గౌతమ్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్, కిశోర్‌కుమార్, సంజీవ, యాకన్న, గణేశ్, లింగన్న, ఉప్పలయ్య, సుధాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు గిర్వాణి పాల్గొన్నారు.



పెద్దముప్పారంలో మాట్లాడుతున్న డోర్నకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే రెడ్యానాయక్